# రాత్రి పూలు

బి.ఎస్.రాములు



**"అన్నయ్యా! నీ భావాల వల్ల నువ్వు నీ జీవితాన్ని చాలా నష్టపోయావు. నీ బతుకు పొద్దు పడమటికి వంగింది. నీ తోటివాళ్ళు ఎపుడో ఆగిపోయారు. వాళ్ళు చేసిందాని కన్నా ఎన్నో రెట్లు ఫలాలు అనుభవిస్తున్నారు. నువ్వు చేసినకాడికి చాలు. నువ్వు చేయాల్సింది యిక యువతరం చేయాలి, చేస్తుంది. నేనింకా ఎన్నాళ్ళో బతకనని నీకు తెల్సు. నా చివరి కోరిక మన్నిస్తావు గదూ!"**

ప్రమీల ఏడుస్తోంది...

రమేశ్ మనస్సు భారమైంది... గొంతు పెకలలేదు.

ఆసుపత్రి గదిలో నిశ్శబ్దం... బెడ్‌పై ప్రమీల. మంచం పక్కనే స్టూలు మీద రమేశ్.

చెల్లెలు ప్రమీల కళ్ళను తుడిచాడు రమేశ్.

"ప్రమీలా! అలాఅనకు. నువ్వు తప్పక బతుకుతావు. నిరాశ పనికిరాదు. ఆత్మ విశ్వాసం రోగాల్ని కూడా జయిస్తుంది".

"అన్నయ్యా!మాట మార్చకు.డాక్టరు ఏంచెప్పాడో అంతా నాకు తెల్సు. నా గురించి కాదు. నీ గురించి బాధపడుతున్నాను. మా కోసం... ఇతరుల కోసం నువ్వు చేసిన త్యాగాలు చాలు..."

"ప్రమీ! కొన్ని నక్షత్రాలుచూడు.వెన్నెల లేనపుడు దారి చూపుతాయి. వెన్నెల ఉంటే అవి కనపడవు. అలాగే కొన్ని పూలు రాత్రి పూసి పొద్దు పొడవడంతో రాలిపోతాయి. కొన్ని ఉదయం పూసి మధ్యాహ్నానికే వాడిపోతాయి. ముగ్గురి జీవితాల్లో ఆశల చిరుదీపం వెలిగించిన నీ జీవితం కొడిగట్టడం నన్నెంత బాధిస్తున్నదో... నాగురించి నేను ఆలోచించుకునే టైంలేదు. ఆ టైం రాకుండానే గడిచిపోవాలని నా కోరిక".

"అన్నయ్యా! రెండు నెలలుగా మంచంలో పడి చావు అంటే ఏమిటో తెల్సుకున్నాను. నాకిపుడు నా గురించి బాధలేదు.నా మనస్సు చాలా ప్రశాంతంగాఉంది.నీకన్నా చాలా చిన్నదాన్ని. కాని ఒక్కటి అడుగుతాను. ఈ క్షణంలో నీవు చనిపోతావని తెల్సింది. ఏం చేస్తావు? ఇపుడు అదే చేయి. నీ త్యాగం, నీ భావాలు నిన్ను నీవు శిక్షించుకోవడంగా పరిణమించకూడదు కదా!"

"ప్రమీ! జీవితం అంటే ఏమిటి! బతుకంతా గడిచాక ఈ ప్రశ్న వేసుకొని ఏం లాభం? బతికినంత కాలం ఈప్రశ్నే ఎదురుకాదు. ఇదో విచిత్రం". కాసేపాగి మళ్ళీ అన్నాడు.

"ప్రమీ! నేను చాలా కోల్పోయానని, జీవితాన్ని నష్టపోయానని ఎందుకు బాధపడ్తావు. అది నీ దృష్టి... నేను కోల్పోయిందానికన్నా పొందిందే ఎక్కువ. మీ ప్రేమ నేను చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ. నేను జీవితాన్ని ఓడిపోలేదని, ఉన్నతమైన జీవితాన్నే గెలుచుకున్నాననే తృప్తినైనా నాకు మిగలనివ్వు".

"అన్నయా! అంత మాటంటే నిన్ను ఏమీ అడగను". అన్నయ్య కళ్ళల్లోకి సుదీర్ఘంగా చూసి కన్నీళ్ళు పెట్టుకొంది ప్రమీల. కనెప్పలు మూతపడ్డాయి. చెంపమీదుగా సన్నని ధార మగతగా ఒరిగింది. ఏవేవో జ్ఞాపకాలు...

తనకు నచ్చని త్యాగాలను చూసి మనిషి అసూయ పడ్తాడా? ఆ అసూయ జాలి, సానుభూతి రూపంలో వ్యక్తమవుతుందా!

మొదటిసారిగా ప్రమీలకు సందేహం కలిగింది. రమేశ్ అన్నయ్య కుటుంబంకోసం చాలా చేశాడు. సమాజంకోసం కూడా చాలా చేశాడు. రకరకాల ఉద్యమాల్లో తిరిగాడు. ఎన్నో ఉద్యమాలు తానే ముందుండి నడిపాడు. ఉద్యమం ఒక నిర్మాణ రూపం తీసుకోగానే క్రమంగా నాయకత్వ పోటీ నుండి తప్పుకునేవాడు.

పోటీ పడ్డం అతని స్వభావం కాదు. పోటీ నుండి తప్పుకోవడం అతని సహజ లక్షణమైపోయింది. పోటీ నుండి తప్పుకొని తనదైన దారిలో కొత్త దారి వేసేవాడు.

'రాజ్యం'ను ఈ పోటీలో గెలుచుకోవడం యిష్టం లేదు. పోటీపడి గెలుచుకోవడం నామోషి అన్పించింది. తన ప్రేమను, ఇష్టాన్ని ఉదాసీనతగా మార్చుకున్నాడు. రాజ్యం తన ప్రేమను వ్యక్తం చేయలేకపోయింది. పైగా 'అన్నయ్య' ప్రేమించడం మానేశాడని గొణిగింది. తప్పు పట్టింది. పోటీపడి ప్రేమిస్తున్న లక్ష్మణ్‌ను ప్రేమించానంది. పెళ్ళి చేసుకుంది.

అప్పట్నుంచీ పోటీపట్ల, పోటీ పరీక్షల పట్ల ఆసక్తిపోయింది. అనుకోకుండా వచ్చిన ఉద్యోగాన్ని సరిపెట్టుకుని అందర్నీ యింతవారిని చేశాడు.

*** ***

అన్నయ్య మాటలు గుండె లోతులో మళ్ళీ మళ్ళీ ప్రతిధ్వనిస్తున్నాయి. ఎంతసేపు నిద్రపోయిందో. రాత్రయ్యింది. మగతగా మెల్లగా కళ్ళు తెరిచింది ప్రమీల.

అన్నయ్య అలాగే చూస్తున్నాడు. చెల్లెలు కళ్ళు తెరవడం చూసి నవ్వాడు. చెల్లెలు మళ్ళీ ధైర్యం తెచ్చుకుంది.

"అన్నయ్యా...చెల్లెలు పెళ్ళయ్యేదాక పెళ్ళి చేసుకోనన్నావు. నా పెళ్ళయిపోయింది. మళ్ళీ చిన్న చెల్లెలు పెళ్ళిఅన్నావు. దాని పెళ్ళీ అయిపోయింది. దానికీ యిద్దరు పిల్లలు.నిన్ను అడగడానికి అందరికీ భయమే. అసలు నువ్వెందుకు పెళ్ళి చేసుకోవడం లేదు అన్నయ్యా!"

"ప్రమీ! పెళ్ళే జీవితానికి పరమార్థం అనుకోను".

"ఈ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, పురుళ్ళు, కట్నాలు, ఖర్చులకోసం అని నీవు పెళ్ళి చేసుకోవడం మానేశావు'.

"అదేం కాదు"?

"నువ్వు ప్రేమించిన రాజ్యం నిన్ను ప్రేమించలేదని వైరాగ్యమా!"

"మొదట అదే ఉండేది. ఇపుడు రాజ్యం మీద కోపం ఏమీ లేదు".

"నువ్వు అసలే పెళ్ళి చేసుకోకపోవడం చూసి రాజ్యం బాధపడ్తోంది".

"ఆమెను బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. అలా అని ఆమె సంతోషం కోసం నేను పెళ్ళి చేసుకోలేను".

"ఏం సాధిద్దామని, ఎవర్ని సాధిద్దామని!"

"పెళ్ళి చేసికొని మీరంతా ఏం సాధిద్దామనుకున్నారు? ఏం సాధించారని? ప్రకృతిలో పశుపక్షాదులూ, ప్రతి ప్రాణీ పిల్లల్ని కంటున్నాయి. అదేనా మీరు సాధించింది?"

"అన్నయ్యా!... అదే లేకపోతే ఈ ప్రపంచమే లేదు. నువ్వు లేవు నేను లేను".

"అదే ప్రపంచమా!"

"కాదు".

"అయినపుడు నా యిష్టప్రకారం నన్ను బతకనీ".

ప్రమీల మూగబోయింది.

"ప్రమీ! నా భావాలే నన్ను బతికిస్తున్నాయి. నువ్వు సమాజం కోసం నేను చేస్తున్నానని అంటున్నదంతా నిజానికి నాకోసమే. నా ఆనందం కోసమే. నా భావాలు వదులుకోమనడం నన్ను చనిపోవాలని కోరడం తప్ప వేరు కాదు".

అన్నయ్యతో అంతగా వాదించడం యిదే మొదటిసారి. బహుశ చివరిసారి కూడా! అనుకుంది ప్రమీల. చూపు తిప్పుకుంది.

కిటికీలోంచి ఆకాశంలో చుక్కలు రాత్రిపూలలా మిలమిల మెరుస్తున్నాయి.

"అన్నయ్యా! నేను జీవితంలో అమ్మతనం సాధించాను. ఈ జీవితానికి యిది చాలు".

తృప్తిగా కళ్ళు మూసుకుంది ప్రమీల. రమేశ్ ఆత్మీయంగా తలపై చెయ్యితో నిమిరాడు. ●